# మహాప్రస్థానం

"నాగార్జునుడు"

డాక్టరు కంగారు పడ్డాడు. ఆమె తనతో మాట్లాడుతూంటే తలవూపినాడు. 'నువ్వు ప్లాట్ ఫారంమీదవున్న అతన్ని ఆనవాలు పట్టి వుంటే ఎందుకు మాట్లాడలేదూ ?' అని అడిగినాడు.

తన దుస్తుల్ని సరిచేసుకొంటూ కూర్చుంది 'నోరా'. జరిగినదంతా క్షణం క్రితం అతనికి విపులంగా చెప్పనే చెప్పింది.

'నేను మాట్లాడాలనే అనుకొన్నాను. కాని, భయపడ్డాను' అంది మందంగా. 'తరవాత, మనస్సు కుదుర్చుకొని, మాట్లాడాలని అనుకొంటూంటే నాకు తెలియకుండానే రైల్లో వచ్చిపడ్డాను. అతను ప్లాట్ ఫారంమీద వుండి పోయాడు. అతనేదో నాతో అంటున్నట్టు తోచింది. కాని నేనది సరిగ్గా వినలేదు.'

డాక్టరు మళ్ళీ తలవూపినాడు.

'ప్లాట్ ఫారంమీద ఏ పురుషుడూ లేడు' అన్నాడు.

'ఇదంతా నీ - నీ జబ్బులో భాగమే. అతను నీ మనస్సులో మాత్రం వున్నాడు. నీ ప్రియుడు నీకు కనబడినట్టూ, అతనేదో అంటూంటే నువ్వు విన్నట్టూ, పూర్ణంగా నువ్వు విశ్వసిస్తున్నావని నాకు తెలుసు. కాని, అమ్మాయ్, ఇదంతా నీమనో రోగ లక్షణమే. నా మాట నమ్ము. ఇలాంటి కేసుల్ని చాలా చూశాను నేను. ఇంకో మూడు నాలుగు నెల్లలో, నీకారోగ్యం వచ్చిన తరవాత, నేనెందుకింత నమ్మకంగా చెప్పినానో నీకే తెలుస్తుంది.'

ఆమె, నిస్పృహను తెలియజేసే నిట్టూర్పు దీర్ఘంగా విడిచి, మళ్ళీ చెప్పనారంభించింది తన నిశితానుభవాన్ని. బహుశా, ఆమె మెల్లిగా, జాగ్రత్తగా చెబితే డాక్టరునకు...

'డాక్టరుగారూ, మీరేమీ అర్థం చేసుకొన్నట్లే లేదే' అన్నదామె. 'నేనేమీ వూహించలేదు. అతన్ని నేను చూశాను. అతని ముఖం, లక్షణాలు నాకు బాగా తెలిసినవే. ఈ రోజు మా వివాహ దినం కావలసిందనే విషయం మీకు జ్ఞాపకంవుంటే ...నేను మొదట ప్లాట్ ఫారంమీదికి వచ్చినప్పుడు అతనక్కడలేడు. నేను రైలుకోసం ఎదురుచూస్తూ ప్లాట్ ఫారంమీద పచారుచేస్తూంటే, అతను అకస్మాత్తుగా నా కంటపడ్డాడు. నేను వెనక్కి తిరిగినప్పుడు అతను వచ్చివుంటాడు. మూటా ముల్లె కాళ్ళదగ్గర పెట్టుకొని కూర్చున్నాడు...'

'నాకు తెలుసు, తెలుసు' అని జాలిగా అడ్డు చెప్పినాడు డాక్టరు. 'ఇది మూడోసారి నువ్వు నాకు చెప్పడం. నీ ప్రియుని కళ్ళల్లో, నీకు భయం కలిగించినా నిన్నుదగ్గిరికి ఆకర్షించిన క్రూరదృష్టిని, కనిపట్టినావు. నువ్వు వెనక్కి ముందుకి నడుస్తూనే వున్నావు. అతన్ని సమీపించి మాట్లాడ్డానికి కావలసిన ధైర్యం సంపాదించడానికి యత్నిస్తూ. అతని కళ్లు నిన్ను పిలుస్తూ, పరీక్షగా చూస్తున్నవని నీకు తెలుసు. కాని నువ్వు భయపడ్డావు. ఇంతలో నీ రైలువచ్చింది. నువ్వు అప్రయత్నంగా రైలెక్కినావు. అది ప్లాట్ ఫారం వదలి వెళ్ళిపోతూంటే నువ్వతని పెదవులుకదలడం చూశావు. అతనిగొంతుక వినబడింది, కాని అతనేమంటున్నాడో నువ్వు గ్రహించలేకపోయావు. అంతే కాదూ ?'

ఔనన్నట్టుగా 'నోరా' తలవూపింది. 'అవును గాని, అమ్మాయ్, ఆది కేవలం అసంభవం అని నీ బుద్ధివల్ల నీకు తెలియాలి. నీ ప్రియుడు చనిపోయి ఆరు నెలలైంది. నువ్వే ఆ విషయం నాతో ఒకప్పుడు చెప్పలేదూ! చనిపోయి ఆరునెలలు. ఇప్పుడుచెప్పు. సవ్యంగాచూడు. ప్లాట్ ఫారంమీద నీకు కనబడ్డ పురుషుడు అతనెట్లా అయివుంటాడో చెప్పు చూద్దాం.

ఆమె డాక్టరువైపు తీక్ష్ణంగా చూసింది.

'మీరింకా అర్థం చేసుకోలేదు. ఈవేళ మా వివాహదినం. నేను వస్తానుగదా అని అతనక్కడ నాకోసం వేచివున్నాడు. ఓ, నేనే గనక అత

నితో మాట్లాడ గలిగివుంటే.‥.మీరు నాకేమీ చెప్పలేరు డాక్టరుగారూ.'

డాక్టరుగారు జాలితో ఆమె బుజంమీద తట్టినాడు.

'నేను నీకు చాలా సంగతులు చెప్పగలను. నువ్వు నామాటలు వినాలి. నే చెప్పేది నువ్వు నమ్మాలి. నీకంటె నేను బాగా అర్థంచేసుకోగలను ఇలాంటివాటిని. అతను చచ్చిపోయాడని నువ్వు ఒప్పుకొంటావు. నిజమే. చచ్చిపోయే ముందు అతనితో నువ్వు వున్నావు. అతని అంత్యక్రియ లన్నీ చూశావు. ఇదంతా సత్యమని నీకు తెలుసు. మరి నువ్వతన్ని ప్లాట్ ఫారంమీద ఎలా చూసి వుంటావు. ఇదంతా నీమనస్సు తనకోసం సృష్టించుకొన్నది, ఈ విధంగానైనా శాంతి లభిస్తుందేమోనని...అమ్మా, ఈ రాత్రి నువ్వు అలసి పోయావు. చూడు. నీ కళ్లెలా లోతుకి దించుకొని పోయాయో.'

'ఉదయం అయ్యేటప్పటికి, నీకు తగినంత విశ్రాంతి లభిస్తుంది గనుక, ఈ రోజుని తల్చుకొని నవ్వుకొంటావు. అంతా సవ్యంగా జరిగివుంటే, ఈ వేళ నీ వివాహం అయివుండేది. ఆ విష యాన్ని తల్చుకొని, అంగీకరించలేకుండావుంది నీ మనస్సు. ఈ రాత్రి నువ్వు, నీకు తెలిసిన వారితో కలిసి భోజనంచెయ్యి. వాళ్లు నీకు మంచి హుషార్ ఇవ్వగలిగిన వారైవుండాలి. తరవాత, నాట్య శాలకువెళ్లు. ఆహ్లాదాన్ని కలిగించేదిచూడు. చాలా రాత్రిదాకా అటూఇటూ తిరిగి ఇంటికిచేరుకో. అప్పటికి నువ్వెంతగా అలిసిపోయి వుంటావంటే, రాయిలా పడుకొంటావు ఇంటికి చేరినవెంటనే.'

అతనిమూర్ఖత్వం ఆమెకు నవ్వుతెచ్చింది. నేటికి మూడునెలలనుండి అతనేదో, మనస్సులిప్పుకో డానికి మార్గాలే చూపిస్తున్నాడు. 'ఎందుచేత డాక్టర్లింత మూర్ఖులు' అనుకొంది. ప్రతీ నాటకం లోనూ ఓ నాయకుడు, ఓ నాయిక. ఓ అబ్బాయి, ఓ అమ్మాయి. ముద్దులు. గుసగుసలు. తాను, తన ప్రియుడు 'కెన్'. 'కెన్, కెన్.' ఆమెచిరాకుపడింది. హోటళ్ళలో ప్రేమగీతాలుపాడుతుంది, ఆర్కెస్ట్రా. నవలలన్నీ ప్రేమను వస్తువుగా కలవే. సరే ఇంక స్నేహితులు...తనను, తన ప్రియుడు 'కెన్ను' ని ఎఱగనివాళ్లే లేరు. వాళ్ళని కలుసుకొంటే తన ప్రియుడు 'కెన్' జ్ఞాపకంవస్తాడు. మానుతూ, మానుతూవున్న కురుపు పైపెచ్చు లాగేసినట్లవు తుంది, వాళ్ళనుచూస్తే...ఆమె డాక్టరుతో అంది. 'ఓ యస్. మీరు చెప్పినట్లే చేస్తాను' అని.

ఆమె 'గుడ్ నైట్' అన్నప్పుడు, ఆమెబుజం మీద డాక్టరు జాలితో తట్టినాడు. అతని ముఖం కలతగావుంది. అతనెంతో మంచివాడే. కాని... అతిసామాన్య విషయాల్నే గ్రహించలేడే .... పాపం.

పైని వీధిలో చీకటి పడనేపడింది. పసిమిదీప శ్రేణి; ఆకాశంయొక్క తెలినీలిమాన్ని, భవనాల యొక్క దృఢమైన, చిక్కని నీలిమనుండి; విభజి స్తోంది. వేగంగా రొదచేస్తూ ప్రవహించే నదిలా, జనసమూహం రోడ్డునునింపింది. బలమైన నవంబరు గాలులధాటీని తట్టుకోడంకోసం ముందుకు వంగి ప్రజలు తొందరగా పోతున్నారు. నిర్మలమైన చన్నీళ్ళవలె ముఖాన్ని కడుగుతూ ఆగాలి ఆమెకు బాగుంది.

కడచిన వారంలో ఆమె ప్రతి రాత్రీ చేసిందే ఇప్పుడూచేసింది. ఓ 'టెలిఫోన్ బాక్స్' లోకి అడుగుపెట్టింది. స్టీవెన్స్ 5-0351. ఓ నిమిషం తర్వాత ఓ స్త్రీకంఠం సమాధానం చెప్పింది. అదే! రాగరహిత కంఠధ్వని. ఆ స్త్రీ చిరాకుగా అన్న 'హల్లో' కి 'నోరా' నిశ్శబ్దంగా వూరుకొంది. ఆ రెండో వైపు రిసీవరును స్వస్థానంలోపెట్టేశారు కాబోలు 'క్లిక్'మని వినబడింది. వెంటనే 'టెలి ఫోన్ ఆపరేటర్' కంఠధ్వని వినబడింది.

నోరా అంది 'నేను స్టీవెన్స్ **5-0351** ని పిలుస్తున్నాను'. ఆపరేటరు 'కనెక్టు' చేశాను అన్నాడు.

'కాని, నాకు కావలసిన వ్యక్తికాదే' అంది నోరా పట్టుదలతో. కొన్ని సెకన్ల తర్వాత టెలి ఫోను సూపర్వైజరు కంఠధ్వని—'అయ్యో! అమ్మా. ఇప్పుడా టెలిఫోను 'సూసన్‌పీస్'పేర లిస్టయివుంది. మీరడిగిన పేరిప్పుడు మా రికార్డు లలో లేదు.'

నోరాకి తెలుసు, ఏదో విధంగా అది నిజం అని. అయినా కాని తప్పేముంది. బహుశా ఆమె అలాపిలుస్తూవుంటే ఎప్పటికేనా అతడు ప్రత్యు త్తరం ఇస్తాడేమో! ఆమె అతన్ని తరుచుగా కలుసుకొనే హోటల్లోనూ అదే విధం. ఈ రాత్రి తోటివాళ్ళతో కలిసి అక్కడలేడు తనప్రియుడు.

నిన్న రాత్రి లేదు. మొన్న, అటు మొన్న కూడా లేదు. ఇంకా అంతకు ముందు ఎన్నో రాత్రులు లేదు కూడా. కాని, బహుశా రేపు రాత్రి అక్కడ వుంటాడేమో !

చాలినన్ని సార్లు, తామిద్దరూ కలిసి తిరిగిన ప్రదేశాలకు వెళ్ళి, ఇదివరకు చేసిన పన్నే చేస్తే; ఆమె ఒక్కసారి ఐనా అదృష్టవంతురాలు కావచ్చు. ఈ అభిప్రాయాన్ని నమ్మడానికి కారణం కనపడక పోవచ్చు; అందుకే మంచి డాక్టరు కూడా దీన్ని నమ్మలేకపోవచ్చు. కాని...నమ్మడానికి భావనా శక్తి కావాలి...'నోరా' చిరునవ్వు నవ్వింది. విషయమంతా, పూర్తిగా తన ప్రియుడు 'కెన్ను' చచ్చిపోయిన ఆ తొలి రోజుల్లో ఆమెకు అవగతం కాలేదు. కాని ఇప్పుడు తెలుసుకొంది—'కెన్ను' కున్నంత దార్ఢ్యంతో, జీవితాశతో, ప్రతిదినాన్నీ ఉత్సాహవంతంగా చేసే చిన్న చిన్న విషయాల పై వాంఛతో; ఎవ్వరూ కూడా పూరికే చచ్చిపోలేరు. అది ప్రకృతి సిద్ధం కాదు. కాని అదంతా బుజువు చెయ్యడానికి ఎంతో నమ్మకం, ఊహ కావాలి. ఆశ్చర్యపడడం చాలా సులభం.

ఆమె, తాను నివసించే వీధిలోనికి వచ్చేటప్పటికి ఎంతో నిరుత్సాహపడింది. తాను నివసించే మేడలోని తన 'అంతస్తు' ఎంతో ఎత్తుగావున్నట్టు, ఆ భవనం చాలా గంభీరంగానూ, తీక్ష్ణంగానూ వున్నట్టు ఆమెకు తోచింది. పదో అంతస్తులో నాలుగో గది ఆమె గది. ఆ గది కిటికీ, వీధిలోకి చీకటిగా వుంది. పనిమనిషికి, దీపం వెలిగించివుంచాలనే జ్ఞానంవుంటే బాగుండును అనుకొంది.

భవనాన్ని సమీపించిన వెంటనే ఆమెకు ఎక్కడ లేని నీరసం వచ్చిపడ్డట్టయింది. లోనికి ప్రవేశిస్తూ తనకేమైనా వార్తలున్నాయా అని గుమాస్తాని అడిగింది. ఏమీ లేవు...ఆమె ఉత్తరాల పెట్టిలో; దంతవైద్యుని వద్దనుండి వచ్చిన ఓ జాబూ, టివాసీలు శుభ్రం చేసేకంపెనీ వాళ్లు- వచ్చేసంవత్సరం కాతా సంపాదించడానికని పంపిన- ఓ అందమైన బ్లాటరు; వున్నాయి.

'ఈరోజు దుర్దినం. నవంబరులో ఇంత గాలి' అని ఇంకా ఏదో చెప్పబోతూవున్న 'ఎలక్ట్రిక్ లిఫ్ట్' వానికి తలవూపి 'అవును దుర్దినం' అంది. అర్థం లేని మాటల్ని అంటూండడం, వింటూండడం ఎంత తమాషా! అదేం భేదం తెస్తుంది జీవితానికి! ఈ వేళ చలి. రేపు ఎండ. లేకపోతే వాన...

మంచానికి దగ్గరగావున్న దీపం వెలిగించింది. పడక కుర్చీకి చేరువగావున్న పసిమిదీపం వెలిగించింది. గదిలో ఒక మూలవున్న పొయ్యిదగ్గరకు వెళ్ళి కట్టెల్ని ఇటూ, అటూ పోకరుతో కదిపింది. గదిఅంతా వెచ్చగావుంది. అబ్బ! ఎంత అలసిపోయింది. పొయ్యికి పైగా గోడనివున్న అద్దంలో ముఖం కనబడింది. తనదేనా ఆముఖం! అబ్బ ఎంత పాలిపోయింది. తన కోటునకు తగిలించివున్న 'గార్డేనియా' పువ్వులా తెల్లగా పాలిపోయివుంది ముఖం. ఆమె పెదవులు, కన్నులు, బుగ్గలలోని లోతులు, ఒకే నల్లరంగుతో వర్ణింపబడినట్లుగా తోచింది ...

ఆమె 'టోపీ' తీసివేసిన వెంటనే నల్లని నిగనిగలాడుతూన్న ఆమెజుట్టు ఆమె తలమీద వెనుకకు పడివుండి నల్లనిరంగు వేసినట్లున్నది. ఎప్పుడో తన ప్రియుడు 'కెన్ను' వ్రాసిన పద్యం జ్ఞాపకం వచ్చింది. ఆమెకు కవిత్వం అంటే అట్టే ఇష్టం లేకపోయినా, ఆ పద్యంమాత్రం చక్కగా వున్నట్టు తోచింది. ఆ పద్యం లో ముఖాన్ని పద్మంతోనూ, జుట్టుని నాచుతోను పోల్చినాడు ... నీటిలోనిపద్మం ... రాత్రిపూట నీరంటే ఆమె కెప్పుడూ గజగజే. అది ఎంతో భయంకరంగా, చెడ్డగా, క్రూరంగా కనబడుతుంది. అలాంటినీటిలో పద్మంలా ముఖం, నాచువలె జుట్టు... పడకకుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకొంది...దీపం వెలుతురు కనురెప్పలలో నుండి వస్తూ ఆమెకు కొంత అభయం చెబుతోంది—

మళ్ళీ ఆమె కళ్లు తెరిచి ఎదురుగా మంచం పైపు చూచేసరికి—'కెన్ను' మంచంమీద, తన కేసి సాభిప్రాయంగా చూస్తూ ... అదే చిరునవ్వు. నవ్వు మూలంగా ముక్కుమీది చిన్ని ముడతలు... దీపం కాంతిలో పళ్ళ తళతళలు...

'ఏం చేస్తున్నావ్, నోరా-అభినయిస్తున్నావా?' అన్నాడతడు. ఆపాదమస్తకం జల్లుమంటూంటే ఆమె అంది, 'కెన్, కెన్; ఇది నువ్వేనా ?' 'ఇంకొకళ్ళనెవర్నేనా నిరీక్షిస్తున్నావా' అన్నాడు కొంటెగా. ఆమెనిర్ఘాంతపోయి చూస్తూంటే అతడు నవ్వినాడు. ఆనవ్వు ఆమెకు, జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూన్న పాటవినబడుతూన్నట్లుంది.

'కెన్, ఇది నువ్వని నేను నమ్మలేను. నేను నిజంగా నమ్మలేను.' అనడం మొదలుపెట్టింది. అతడు మళ్లీ నవ్వడం ప్రారంభించినాడు. 'సరే, అయితే నేనెవర్నేమిటి?' అని నొక్కి అడిగినాడు.

'నువ్వు నా 'కెన్ను' వి. రావనుకొన్న నా 'కెన్ను'వి. కావా నువ్వు?' అంది.

'మంచి పనే, అమ్మాయ్.' అన్నాడతడు. 'నువ్విలా నా వైపుచూస్తూ కూర్చోక, నాకో సిగరెట్టేనా, కాస్త పానీయమేనా ఇయ్యకూడదా.'

'ప్రియా, కెన్' అని నోరా అరచి అతన్ని కౌగిలించుకొన్నది. ఆమెకు అతని దగ్గర తన కిదివరలో సుపరిచితమైన ఆ పొగాకు వాసనే, ఆ 'షేవింగులోషను' వాసనే వేసింది. అతని ముఖం చల్లగావుంది. అతడామెను ముద్దుపెట్టుకొంటూంటే, స్థానం తప్పి అతని ముంగురులు కొన్ని, ఆమెకు గిలిగింతలు పెట్టినవి.

'నిన్ను కలుసుకోవాలని చాలాసార్లు ప్రయత్నం చేశాను' అని నసిగినాడు.

'నిజమేనా, కెన్నూ' అంది 'నోరా'.

'ఈవేళ, స్టేషను దగ్గర నువ్వు కొంచెం సేపు ఆగి నాతో మాట్లాడుతావను కొన్నాను. ఎందుకు మాట్లాడలేదు?' అన్నాడు.

నోరా అంది. 'అయితే, ఈవేళ ప్రొద్దున్న, నువ్వే నన్నమాట.'

'అయ్యో! వెర్రిదానా! ఈవేళ రాత్రి నీకు నచ్చచెప్పడం చాలా కష్టంగావుందే! అవును, నేనే, నువ్వా రైలుపెట్టెలోనికి పరుగెత్తడంచూస్తే నా కాశ్చర్యం వేసింది. నేనేమన్నా నిన్ను కొరుక్కొని తింటా ననుకొన్నావా? మళ్ళీ, తర్వాత, నువ్వు 'ఫోను'చేసి నప్పుడు నేను 'హల్లో' 'హల్లో' అన్నాను. కాని నువ్వు వినిపించుకో లేదు. తరువాత మళ్లీ మన హోటల్లో నిన్ను చూసి చెయ్యి వూపినా, నువ్వు చూడకుండా పరుగెత్తినావు.'

నోరా అతని వైపు చూసింది. అతని కళ్లు, ఆమె కళ్ల ప్రక్కని పెద్దవిగా వున్నాయి. చూపుడు వేలితో అతని బుగ్గ నిమురుతూ, 'అవునుగాని, కెన్...డాక్టరు నాకు మతి స్థిరంలేదన్నాడు. ఇంకా ఏదో అన్నాడు...ఓ కెన్, ఓ కెన్, నేనలానిరీక్షిస్తూంటేనువ్వువస్తావని నాకు తెలుసు'అంది.

తన దగ్గరనుండి ఆమెను కొంచెం దూరంగాతీసి 'కెన్' మెల్లిగా ఇలా అన్నాడు.

'నేను చాలాకాలంనుంచి నీకు చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాను, నోరా. నేను అలసిపోయాను. మళ్లీ రాలేను. అప్పుడే నెలలెన్నో అయ్యాయి. నీ అంతట నువ్వే ఇది నిర్ణయించుకోవాలి. నా వైపునుండి బలవంతం ఏమీలేదు. నే చెప్పేది జాగ్రత్తగా విను. నీమనస్సులో నిర్ణయించుకో. ఈరోజు ఏరోజో నీకు జ్ఞాపకం వుందా? నేను నిన్ను తీసుకొని వెళ్ళడానికి వచ్చినాను. నీ కిష్టమైతేనే సుమా! నీకు రావాలని వుంటే ఇప్పుడే, ఈక్షణం నాతో రావాలి. నువ్వు భయపడవచ్చు, పశ్చాత్తాప పడవచ్చు. కాని ఒక్కటి తెలుసుకో. నేను మళ్ళీరాలేనని గ్రహించు. నేను చాలాదూరం వెళ్లాలి.'

దీనికి జవాబుగా ఆమె అతని చేతుల్లోకి వాలి కౌగిలించుకొన్నది.

ఆమె అతనితో కలిసి గదికిటికీ దగ్గరకువెళ్లింది. కిటికీ తీస్తూ అన్నాడతను, "నేను 'వూఁ' అన్న వెంటనే నాచెయ్యిపట్టుకొని కిటికీలోంచి అవతలకి వచ్చెయ్యి. భయపడకేఁ. కళ్ళుమూసుకొని నా చెయ్యిపట్టుకో, నీకేంభయంలేదు. నిన్ను నేను వదలన్లే."

వాళ్లు, కిటికీలోంచి ఇంటిఆవరణలోకి తొంగి చూశారు ... పదిఅంతస్తుల కిందికి .. ఓ నౌఖరు ఇంట్లోకిపోతూ కనపడ్డాడు. 'కెన్' ఆమెను కొంచెం వెనక్కినెట్టినాడు.

'కొంచెంసేపు ఆగు' అన్నాడు. వాళ్లు ఆగినారు. ఎదురుగుండావున్న ఇళ్ళలోనివాళ్లు భోజన ప్రయత్నంలో వున్నారు కాబోలు; కప్పులు, సాసర్లచప్పుళ్లు తెరచివున్న కిటికీల్లోంచి వినబడుతున్నాయి. కిటికీలలోంచి పొగలు కొద్ది, కొద్దిగా పైకివస్తున్నాయి...ఇంటిఆవరణలో ఎవ్వరూలేరు. తెరచివుంచిన గుమ్మంలోంచి, పొడుగ్గా 'గోరీ' ఆకారంగా వెలుతురు ఆవరణలోనికి పడుతోంది.... 'కెన్ను' వైపు చూడ్డానికి ఆమె వెనక్కి తిరిగింది. అతనునవ్వి, సిద్ధంగావున్నావా అన్నట్లు తల వూపినాడు. ఆమె అతనిచేతిని 'ఆఁ' అన్నట్లు నొక్కింది.

'వూఁ' అన్నాడతను.

(ఆంగ్ల కథకు అనుసరణ)